క్లుప్తంగా

షర్మిల నాటకాలు కట్టిపెట్టాలి

తాడేపల్లిరూరల్ : అన్నకే వెన్నుపోటు పొడిచి, తానే ఏ తప్పు చేశానని అమాయకంగా వైఎస్సార్ అభిమానులను అడుగుతున్న షర్మిల తన నాటకాలు కట్టిపెట్టాలని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. ఆదివారం దుగ్గిరాల ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మరణించక ముందే తన వారుసులకు ఆస్తులు పంపిణీ చేశారన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా సంపాదించిన ఆస్తులను సైతం ప్రేమతో తన చెల్లి షర్మిలకు పంచారని పేర్కొన్నారు. అన్ని మరచి అన్నయ్య ప్రత్యర్థులతో చేతులు కలిపి కుటిల రాజకీయం చేస్తోందని విమర్శించారు. ఈడీ జప్తులో ఉన్న ఆస్తులను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విజయమ్మ పేరుతో గిఫ్ట్ చేశారని, అన్నీ తెలిసిన షర్మిల స్టేటస్‌కో ఇచ్చిన ఆస్తులు బదలాయించి జగన్ బెయిల్ రద్దు అయ్యే పరిస్థితి కల్పించారన్నారు.

కార్మెల్ మాతకు పూజలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కార్మెల్ కొండపైనున్న కార్మెల్ మాతను దర్శించుకునేందుకు ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. ఉదయాన్నే బాల ఏసు దేవాలయం వద్ద ప్రత్యేక దివ్యబలి పూజలో పాల్గొని కొండనుఎ క్కారు. తలనీలాలు సమర్పించి కొవ్వొత్తులు వెలిగించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

అనుమతులు తప్పనిసరి



మంగళగిరి: బాణ సంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి అని పట్టణ సీఐ డి.వినోద్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వ్యాపారులు అనుమతులు తీసుకోవాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అధికారులు అనుమతులు ఇచ్చిన ప్రదేశంలో మాత్రమే దుకాణాలు నిర్వహించాలని చెప్పారు.

వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సేవా కార్యక్రమాలు



తెనాలి: స్థానిక చెంచుపేటలోని వాసవి క్లబ్ ఇస్కాన్, తెనాలి టౌన్ ఇస్కాన్, తిరుమల సాయిక్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ రవిచంద్రన్ పర్యటనలో భాగంగా ఆదివారం పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. బుర్రిపాలెం రోడ్డులోని గోశాలలో పశువులకు పశుగ్రాసం అందజేశారు. చెంచుపేటలోని ఎలిచూరి అమ్మ వృద్ధాశ్రమంలో నిత్యావసర సరుకులు, దుస్తులు, ఫ్యాన్లు, కుర్చీలు అందజేశారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు ఇచ్చారు. 2004లో వాసవీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా పనిచేస్తూ అకాలమరణం చెందిన పొన్నూరు సుధీర్ కుటుంబసభ్యులకు రూ.2.50 లక్షల చెక్కును క్లబ్ గవర్నర్ రవిచంద్రన్ అందజేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ట్రెజరర్ శివబ్రహ్మప్రసాద్, ప్రెసిడెంట్ ఖాజా పద్మజకుమారి, సెక్రటరీ పి.పరమేశ్వరీ, ట్రెజరర్ ఎం.సత్యతి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. క్లబ్ ఇంటర్నేషనల్ గవర్నర్‌ను ఘనంగా సత్కరించారు.

జూదరుల అరెస్ట్

తెనాలిరూరల్: పట్టణ ఐతానగర్ తాడిబోయిన వారి వీధిలో పేకాట ఆడుతున్నరన్న సమాచారంతో టూ టౌన్ సీఐ నిసార్‌బాషా, సిబ్బంది ఆదివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 25,260 స్వాధీనం చేసుకున్నారు. నిందితులను సోమవారం కోర్టులో హాజరుపరచనున్నట్టు పోలీసులు తెలిపారు.

షుగరు వ్యాధికి ఉచిత వైద్య శిబిరం



తెనాలి: పట్టణానికి చెందిన డీ3 శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం బుర్రిపాలెం రోడ్డులోని ఎస్ భవనంలో ఉచిత షుగరు వ్యాధి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.శారద ఆధ్వర్యంలో ప్రతినెల చివరి ఆదివారం వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేస్తున్నారు. ఆ ప్రకారం జరిపిన శిబిరంలో దూరప్రాంతాల్నుంచి వచ్చిన రోగులకు బీపీ, షుగరు పరీక్షలు చేశారు. సొసైటీ వారు అందించిన అల్పాహారం తీసుకున్న తదుపరి మరోసారి పరీక్షలు చేసి, నెలకు సరిపడా మందులను పంపిణీ చేశారు. మందులు వేసుకోవడంతోపాటు ఆహార వ్యాయామ నియమాలను నిబద్ధతతో పాటించాలని ఈ సందర్భంగా డాక్టర్ శారద రోగులకు సూచించారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ వైద్యశాలలు, క్లినిక్స్‌లోని సదుపాయాలను సద్వినియోగం చేసుకుని, అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని సలహానిచ్చారు. సేవల్లో పేదలు నిరాదరణకు గురి కాకుండా ఉండాలన్నదే తమ అభిమతమన్నారు. 200 మంది రోగులకు పరీక్షలు చేయగా, 20 మంది వలంటీర్లు సహకరించారు.

333 కుటుంబాలు

30 ఏళ్లుగా పోరాటం

- ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ అనధికారిక లాకౌట్
- రోడ్డున పడ్డ 333 కార్మిక కుటుంబాలు
- వేతన బకాయిల కోసం 30 ఏళ్లుగా పోరాటం
- బకాయిలు చెల్లించాలని హైకోర్టు ఉత్తర్వులు
- కనీసం కోర్టు ఉత్తర్వులు కూడా పట్టని వైనం
- ఫ్యాక్టరీ భూములు 190 ఎకరాలు విక్రయం
- బాలభాను ఎంటర్‌ప్రైజెస్ పేరుతో రూ.10.92 కోట్లకు కొనుగోలు
- ఆత్మహత్యలే శరణ్యం అంటున్న కార్మిక కుటుంబాలు



ఫ్యాక్టరీ భూముల్లో కార్మిక కుటుంబాల ఆందోళన



తాడేపల్లి బ్రహ్మానందపురంలో ఉన్న ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ (ఫైల్)

తాడేపల్లిరూరల్ : ఒకప్పుడు తాడేపల్లి పట్టణం బ్రహ్మానందపురంలోని ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ ఉద్యోగులు ఎంతో హుందాగా బతికారు. ఇప్పుడు వారి కుటుంబాలు బతకలేని దీన స్థితిలో ఉన్నాయి. అందులో పనిచేస్తున్న కార్మికులు రోజువారి కూలీలుగా మారగా.. కొంతమంది కంపెనీ లాకౌట్ తట్టు కోలేక గుండె ఆగి మరణించారు. అప్పటి నుంచి ఆ కంపెనీలో పనిచేసిన కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి రావాల్సిన బకాయిల గురించి పోరాడుతూనే ఉన్నారు.

వివరాల్లోకి వెళితే

తాడేపల్లి బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీలో వివిధ హోదాల్లో 333 మంది కార్మికులు పనిచేసేవారు. 1990లో సిమెంట్ ఫ్యాక్టరీ యజమాన్యం అనధికారికంగా లాకౌట్ ప్రకటించింది. అనంతరం హెచ్ఎంపీ సిమెంట్ కంపెనీ లీజ్‌కు తీసుకుని 3 సంవత్సరాలు నడిపింది. 1993 చివరలో పూర్తిగా సిమెంట్ ఫ్యాక్టరీని మూసివేశారు. అప్పటి నుంచి ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావాల్సిన వేతనాల గురించి, అనధికారిక లాకౌట్ గురించి పోరాడుతూనే ఉన్నారు.

కోర్టు ఏం చెప్పింది..

ఈ క్రమంలోనే సిమెంట్ ఫ్యాక్టరీకి చెందిన 190 ఎకరాల భూమిని.. అధికార పార్టీల్లో కీలకంగా ఉన్న కొంతమంది నాయకులు బాలభాను ఎంటర్‌ప్రైజెస్ పేరుతో రూ.10.92 కోట్లకు కొనుగోలు చేశారు. అప్పటి నుంచి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు పోరాటం చేయగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పుడు హైదరాబాద్‌లోని హైకోర్టు కార్మికులకు అనుకూలంగా తీర్పునిచ్చింది. ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ గానీ, లేదా ఆ భూములను కొనుగోలు చేసిన వారు గానీ 2015 జులై 16 వరకు 333 మంది కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలను 12.5శాతం వడ్డీతో చెల్లించి, ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలని అందులో పేర్కొంది. భూమిని కొనుగోలు చేసిన వారు కానీ, ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం కానీ, కార్మికుల బకాయిలు చెల్లించలేదు. సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం కార్మికుల బకాయిలు, వాటిపై ఉన్న లావాదేవీలు అన్నీ కూడా భూములు కొనుగోలు చేసిన వారు మాత్రమే ఇవ్వాల్సి ఉందని చెప్పేశారు. దీంతో కార్మికులు అప్పటి నుంచి పోరాడుతున్నా రాజకీయ పలుకుబడితో వారిని బెదిరిస్తూ వచ్చారు. కార్మికులు తమకు రావాల్సిన బకాయిలపై 30 ఏళ్ల నుంచి పోరాడుతున్నా.. నేటికీ వారిని పట్టించుకునే వారు లేరు.

చాలీచాలని కూలి డబ్బులతో..



సిమెంట్ ఫ్యాక్టరీ లాకౌట్ చేసిన తర్వాత చాలీచాలని కూలి డబ్బులతో బతుకు సాగించాం. ఫ్యాక్టరీలో మా నాన్నగారు కోటయ్య 30 ఏళ్లు పనిచేశారు. నేను 15ఏళ్లు పనిచేశాను. నాకు రూ.3,372 జీతం వచ్చేది. ఇద్దరు పిల్లలు, ఫ్యాక్టరీ లాకౌట్ తరువాత కుటుంబం ఛిన్నాభిన్నం అయ్యింది. క్వార్టర్స్ బలవంతంగా ఖాళీ చేయించడంతో అద్దెకు వెళ్లాం. పిల్లల్ని చదివించలేక కూలి పనులకు పంపించాం. ఇప్పటికీ చాలీచాలని కూలి నగదు బతుకీడుస్తున్నాం.

మాసపోగు విశ్వేశ్వరరావు

లాకౌట్ తట్టుకోలేక నా భర్త మృతి



సిమెంట్ ఫ్యాక్టరీ రన్నింగ్‌లో ఉన్న సమయంలో మా కుటుంబం ఎంతో బాగుండేది. చెప్పా పెట్టకుండా రాత్రికి రాత్రి లాకౌట్ విధించడంతో నా భర్త లక్ష్మయ్య అనారోగ్యం పాలై సంవత్సరం అనంతరం గుండెపోటుతో మరణించాడు. నా భర్త మరణంతో మేమందరం అనాథలం అయ్యాం. నా కొడుకు కూడా గుండెపోటుతో మృతి చెందాడు. ఇప్పుడు నేను, నా మనవడు ఉంటున్నాం. సిమెంట్ ఫ్యాక్టరీ బకాయిలు ఇప్పిస్తే నా మనవడికి న్యాయం చేసిన వారు అవుతారు.

బోసు రాములమ్మ

ఎవరూ పట్టించుకోవడం లేదు



ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీని కార్మికులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా మూసివేశారు. కార్మిక సంఘాల సహాయంతో 30 సంవత్సరాలు పోరాడుతూనే ఉన్నాం. 2015లోనే కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించాలని కోర్టు తీర్పు ఇచ్చింది. అయినా ఎవరూ పట్టించుకోలేదు. తమ వాటాలు తాము తీసుకుని, కార్మికులకు అన్యాయం చేస్తున్నారు. రూ.కోట్లు విలువ చేసే ఏసీసీ భూములను కొనుగోలు చేసిన వారు మా బకాయిలు చెల్లించకపోతే పోరాటం ఆగదు.

ఏనుగుల సుబ్బారావు

భూమి అయినా ఇవ్వాలి



సిమెంట్ ఫ్యాక్టరీని నమ్ముకుని ఉన్న 333 కార్మిక కుటుంబాలు లాకౌట్‌తో రోడ్డున పడ్డాయి. గౌరవ న్యాయ స్థానం ఇచ్చిన తీర్పు ప్రకారం భూమిని కొనుగోలు చేసిన వారు మా జీత భత్యాలు చెల్లించాలి. లేదా 333 మంది కార్మికులకు రావాల్సిన బకాయిల బదులు 195 ఎకరాల్లో వాటా అయినా ఇవ్వాలి. అలాగే రాజకీయ నాయకులు కూడా కల్పించుకుని మాకు మద్దతు తెలిపి కార్మిక కుటుంబాలకు అండగా ఉండాలి. లేకుంటే ఆత్మహత్యలు తప్పవు.

యస్‌కె బాషా

వెలగని వీధి దీపాలు

4 నెలలుగా తాడికొండ మెయిన్ బజార్‌లో అంధకారం



అంధకారంగా రోడ్డు

తాడికొండ: తాడికొండ ప్రధాన రహదారిపై వెలగని వీధి లైట్లను పట్టించుకునే నాథుడు లేడు. గత నాలుగు నెలలుగా అంధకారంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పోలీస్ స్టేషన్ కూడలి నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకు ప్రధాన రహదారిపై వీధి లైట్లు జూన్ 14న మరమ్మతులకు గురయ్యాయి. చిన్నపాటి సమస్యను గుర్తించి అధికారులు మరమ్మతులు చేసి, వెలిగించే ప్రయత్నం చేయకపోవడంతో పరిస్థితి అధ్వాన్నంగా మారింది. గతంలో సీఆర్డీయే నిధులతో ప్రధాన రహదారి నిర్మాణం, వీధిలైట్లు ఏర్పాటు చేశారు. అయితే వాటి నిర్వహణ భారం కూడా సీఆర్డీయేనే తీసుకోవాలని చెబుతూ గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రతిసారి ఇదే సమస్య పునరావృతం అవుతోంది. ప్రస్తుతం 4 నెలలుగా ప్రధాన రహదారి అంధకారమయమైంది. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇకనైనా స్పందించి ప్రధాన రహదారిపై వెలగని వీధిలైట్లకు మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.

అనధికార లే అవుట్లపై నగర పాలక సంస్థ చర్యలు

గుంటూరు రూరల్: నగరపాలక సంస్థ పరిధిలో అనధికార వెంచర్లు, లే అవుట్లు ఉండడానికి వీలు లేదని, అటువంటి వాటిపై స్పెషల్ డ్రైవ్ చేపట్టి తొలగిస్తామని గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. ఆదివారం నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక అధికారులు ఆర్టీఓ ఆఫీస్‌రోడ్, సీతయ్యడొంక రోడ్లలోని అనధికార లే అవుట్స్‌లో ఏర్పాటు చేసిన హద్దు రాళ్లు, బోర్డులు, రోడ్లను మూడు పొక్లెయిన్‌లతో పూర్తి స్థాయిలో తొలగించారు.

విద్యార్థులకు చదువుతో పాటు ఆధ్యాత్మికత అవసరం



ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులతో అతిథులు

- ఐఐటీ, మద్రాస్ ప్రొఫెసర్ ఎమిరిటస్ డాక్టర్ ఎన్.రమేష్‌బాబు
- 111 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు రూ.19 లక్షల ఉపకార వేతనాల పంపిణీ

తెనాలి: విద్యార్థులు చదువుతోపాటు ఆధ్యాత్మిక ఆలోచలనలను అలవరచుకోవాలని, సమాజాభివృద్ధికి సహాయపడాలని ఐఐటీ, మద్రాస్‌లో మెకానికల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ ఎమిరిటస్, అడ్వాన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్ సెక్రటరీ డాక్టర్ ఎస్.రమేష్‌బాబు సూచించారు. పట్టణానికి చెందిన వడ్లమూడి కోటయ్య చౌదరి ఛారిటీస్ ఏటా నిర్వహిస్తున్నట్టే ఈ ఏడాది ఉపకార వేతనాల ప్రదానోత్సవాన్ని ఆదివారం స్థానిక ఎన్జీఓ కల్యాణమండపంలో ఏర్పాటుచేశారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ వడ్లమూడి గోవర్ధనరావు అధ్యక్షత వహించారు. 2024 సంవత్సరానికి 111 మంది విద్యార్థులకు రూ.19 లక్షల ఉపకార వేతనాలను అందజేశారు. సభలో డాక్టర్ రమేష్‌బాబు మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణ అలవరచుకుని ఇష్టంగా చదువుకుంటే రాణించగలరని చెప్పారు. విద్యాభివృద్ధికి ట్రస్ట్ ఆశయాలను అభినందించారు. అభ్యుదయ కవి డాక్టర్ గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులున్న ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహం ఇస్తున్న ట్రస్ట్ నిర్వాహకుల కృషి గొప్పదన్నారు. విద్యార్థి దశలో కష్టపడి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని చెబుతూ సమాజానికి తిరిగి ఏవిధంగా సహాయపడాలనేది విద్యార్థులు ఆలోచించుకోవాలని సూచించారు. పట్టణంలో ప్రముఖ న్యాయవాదిగా గుర్తింపును పొందిన వడ్లమూడి కోటయ్యచౌదరి పేరుతో ట్రస్ట్‌ను నెలకొల్పి, పేద విద్యార్థులకు గత 28 ఏళ్లుగా ఆర్థికసాయం అందిస్తున్నట్టు డాక్టర్ గోవర్ధనరావు గుర్తుచేశారు. ఇప్పటివరకు 450 మంది విద్యార్థులకు 1210 ఉపకార వేతనాల ద్వారా రూ.1.85 కోట్లు పంపిణీ చేశామని వివరించారు. ట్రస్ట్ సభ్యులు వడ్లమూడి బసవప్రసాద్, వడ్లమూడి బసవారావు పాల్గొన్నారు.

పంచారామాలకు తెనాలి నుంచి ప్రత్యేక బస్సులు

తెనాలి డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్



తెనాలిఅర్బన్: కార్తికమాసం సందర్భంగా ప్రతి శని, ఆదివారాల్లో తెనాలి డిపో నుంచి పంచారామలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ ఆదివారం తెలిపారు. పంచారామలైన సామర్లకోట, ద్రాక్షారామం, పాలకొల్లు, భీమవరం, అమరావతి పుణ్యక్షేత్రాలను ఒక రోజులోనే దర్శించుకుని తెనాలి చేరుకునే విధంగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సూపర్ లగ్జరీ బస్సు టిక్కెటు ధర రూ.1270, లగ్జరీ బస్సుకు రూ.1200 చార్జీగా నిర్ణయించినట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. అదే విధంగా తెనాలి డిపో నుంచి త్రి శైవక్షేత్రాల దర్శిని కూడా ఏర్పాటు చేసినట్లు వివరించారు. త్రి శైవ దర్శనంలో యాగాంటి, మహానంది, శ్రీశైలం పుణ్యక్షేత్రాలను దర్శించుకునే విధంగా ఏర్పాటు చేశామన్నారు. త్రి శైవక్షేత్రాల దర్శిని భక్తులు కోరినమీదట మాత్రమే బస్సు సర్వీసు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. శబరిమలై, అరుణాచలానికి అద్దె ప్రాతిపదికన సరసమైన ధరలకు నూతన సూపర్‌లగ్జరీ బస్సులను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాలను భక్తులు ఉపయోగించుకోవాలని కోరారు. వివరాలకు సెల్‌నెం.7382892492 లో సంప్రదించాలని సూచించారు.

కిడ్నీ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న వెంకటనాయుడు

డాక్టర్ వి.వెంకటనాయుడు

లక్ష్మీపురం: కిడ్నీ వ్యాధులపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని డాక్టర్ వి.వెంకటనాయుడు అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివ రామిరెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్య సభ ఆదివారం నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ ప్రధానంగా మనం తీసుకునే నీరు, వివిధ ఆహార పదార్థాల మూలంగా మూత్రపిండాలలో రాళ్లు ఏర్పడతాయని వివరించారు. మధుమేహం ఉన్న వారిలో ఈ యూరినరీ ట్రాక్ ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశం ఎక్కువ అని ఇన్ఫెక్షన్ వచ్చిన సమయంలో చలి జ్వరం, మూత్ర విసర్జనలో మంట లాంటి లక్షణాలు కనబడతాయన్నారు. అనంతరం అవగాహన సభ్యులు అడిగిన మూత్రపిండ సమస్యలకు సంబంధించిన విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం డాక్టర్ వెంకట నాయుడును ఘనంగా సత్కరించారు. సమావేశానికి టీవీ సాయిరాం కోఆర్డినేటర్ గా వ్యవహరించగా డాక్టర్ రమ్య, డాక్టర్ ఏ రవీంద్ర కుమార్, సీనియర్ యోగాచార్యులు ఇందు శేఖర్ పాల్గొని ప్రసంగించారు.

రాజేంద్ర ప్రసాద్ సేవలు నిరుపమానం

తెనాలి: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, మహాప్రస్థాన సేవాసమితి సంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు, పట్టణానికి చెందిన సినీ ఎగ్జిబిటర్ వుయ్యూరు రాజేంద్రప్రసాద్ సంస్మరణ సభను ఆదివారం సాయంత్రం నిర్వహించారు. స్థానిక కవిరాజ పార్కులోని వీజేఆ భవన్‌లో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన సభకు అసోసియేషన్ అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ప్రవాస భారతీయుడు డాక్టర్ బాబు ఆర్.వడ్లమూడి, డాక్టర్ వంకాయలపాటి అబ్బయ్య హాజరై, రాజేంద్రప్రసాద్ సేవలను గుర్తుచేసుకున్నారు. 2002లో శ్రీవేంకటేశ్వర టాకీస్‌లో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను, 2008లో మహాప్రస్థాన సేవా సమితిని ఆరంభించినట్టు చెబుతూ, ఆయా అసోసియేషన్ల అభివృద్ధికి రాజేంద్రప్రసాద్ చేసిన కృషి నిరుపమానమని చెప్పారు. రాజేంద్రప్రసాద్, రతన్‌టాటాల చిత్రపటాలకు శ్రద్ధాంజలి ఘటించారు. అక్టోబరు నెలలో జన్మించిన సభ్యులు డాక్టర్ కృష్ణ కె.వడ్లమూడి, నన్నపనేని ముకుందరావు, ముత్తేవి రవీంద్రనాథ్, లేళ్ళ శంకరరావు, పీఎస్ఎన్ మల్లేశ్వరరావు, పి.పోలేశ్వరరావు, మామిడి రాధాకృష్ణమూర్తి, చెరుకూరి శివరామయ్య, గిరి శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యదర్శి ప్రసాదం పూర్ణచంద్రరావు, రాజేంద్ర ప్రసాద్ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

సనాతన ధర్మ పరిరక్షణలో భాగమే సహపంక్తి భోజనం

తెనాలి: పేదలకు అన్నదానాలు, వరదలు, ప్రమాదాలు, అత్యవసర పరిస్థితుల్లో మినహా బఫే భోజనాలను ప్రోత్సహించవద్దని సహపంక్తి భోజనం విధానాన్ని అనుసరిస్తూ సనాతన హిందూ ధర్మాన్ని కాపాడాలని శ్రీఆంజనేయం ధ్యాన యోగమండలి వ్యవస్థాపకుడు కిషోర్ గురూజీ అన్నారు. స్థానిక రామలింగేశ్వరపేటలోని యోగమండలి ఆశ్రమంలో సహపంక్తి ప్రచార యజ్ఞాన్ని ఆదివారం ప్రారంభించారు. ముంత శ్రీనివాసరావు స్వామీజీ వితరణతో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. 'బఫే భోజనం విసర్జించండి...సహపంక్తి భోజనాన్ని ఆచరించండి' అని ప్రచారం చేశారు. మంగళగిరి, ఖాజీపేట, గుంటూరు, రేపల్లె, సోమసుందరపాలెం, కంచర్ల పాలెం నుంచి పలువురు యోగ సాధకులు హాజరైన కార్యక్రమంలో కిషోర్ గురూజీ మాట్లాడారు. కన్వీనర్ సూర్యనారాయణ స్వామీజీ పాల్గొన్నారు.

అంకిత భావానికి తగిన గుర్తింపు



శ్యామ్యూల్ మాస్టారు దంపతులకు సత్కారం

తాడికొండ: విధి నిర్వహణలో అంకిత బావంతో పని చేసిన వారికి తగిన గుర్తింపు తప్పక ఉంటుందని స్కౌట్స్ అండ్ గిల్డ్ సభ్యులు కొనియాడారు. కంతేరు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేసి ఇటీవల పదవీ విరమణ పొందిన మట్టుకొయ్య శ్యామ్యూల్ దంపతులను వారు ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులుగా ఉంటూ పలువురిని ప్రయోజకులుగా తీర్చిదిద్దడంతో పాటు సామాజిక సేవలో కూడా శ్యామ్యూల్, ప్రమీల దంపతులు ముందంజలో ఉన్నారన్నారు. కరోనా కష్ట కాలంలో, ఇతర సహాయక కార్యక్రమాల్లో నిత్యం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న శ్యామ్యూల్ మాస్టారి జీవితం సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో గడవాలని కోరుతున్నట్లు పలువురు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ తాడికొండ గిల్డ్ సభ్యులు జొన్నల సుబ్బారెడ్డి, కందుల గోపాల రావు, దమ్మాటి రమేష్, కె మల్లేశ్వరరావు, కె నాగేశ్వరరావు, ఎస్వీ సుబ్బారావు, సీహెచ్ భాస్కరరావు పాల్గొన్నారు.

వ్యవస్థ పటిష్టతకు బ్రాహ్మణులంతా ఏకం కావాలి



బ్రాహ్మణ వధూవరుల వివాహ సమచార డైరీని ఆవిష్కరించిన లోకనాథశర్మ

తెనాలి: వ్యవస్థను పటిష్ట పరచుకునేందుకు బ్రాహ్మణ శాఖీయులంతా ఏకం కావాలని దేవదాయశాఖ మాజీ ఆగమ సలహాదారు, ఆలిండియా బ్రాహ్మణ వివాహ సమాచార కేంద్రాల సలహాదారు పండిత యాబలూరి లోకనాథశర్మ సూచించారు. ఆంధ్రాప్యారిస్ బ్రాహ్మణ ఉచిత సమాచార కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక నూకల రామకోటేశ్వరరావు కల్యాణ మండపంలో రాష్ట్ర స్థాయి బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదికను నిర్వహించారు. వేదిక అధ్యక్షుడు తురిమెళ్ల దక్షిణామూర్తి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన లోకనాథశర్మ వివాహ సమాచార డైరీని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వేదంలో బ్రాహ్మణులంతా ఒకటేనని చెప్పినట్టు గుర్తుచేశారు. సభలో ఎఫ్ఓబీఎంఐఎస్ చైర్మన్ సీఆర్‌కే శేషగిరిరావు, కార్యదర్శి మాచిరాజు కిరణ్, ఉపాధ్యక్షుడు జయంతి ప్రకాష్, భాగవతుల జయలక్ష్మి, పీఎస్ఎస్ఏ ప్రసాద్, ఎంఎస్ విశ్వనాథ్, కె.రాఘవరాము, వేదిక గౌరవాధ్యక్షుడు ఎస్.ప్రకాష్‌రావు, సలహాదారు సత్యనారాయణమూర్తి, కార్యదర్శి సత్యకుమార్, కోశాధికారి రాజేంద్రప్రసాద్, సంయుక్త కార్యదర్శి వేణుధర్ మాట్లాడారు. 750 కుటుంబాలకు చెందిన వధూవరులు దరఖాస్తులు స్వీకరించారు. వేదిక వద్దనే వారి జాతకాలను పరిశీలించి, కుటుంబ సభ్యులు ఆమోదంతో పలువురికి వివాహ నిశ్చయం చేశారు. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న 15 మంది ప్రముఖులను వివాహ సమాచార కేంద్రం సభ్యులు సత్కరించారు.

ఆకట్టుకున్న సంప్రదాయ సంగీతం కచేరి

నగరంపాలెం: భావి తరాలకు సంప్రదాయ సంగీతాన్ని అందించటమే లక్ష్యంగా నిర్వహిస్తోన్న కార్యక్రమాలు అభినందనీయమని డాక్టర్ వైవీకే దుర్గాప్రసాదరావు అన్నారు. గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణలోని అన్నమయ్య కళా వేదికపై నిర్వహిస్తోన్న వాగ్గేయకార మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. డాక్టర్ వై.శైలజ, ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వర రావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. సన్మండలి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ పి.విజయ, ఎంవై.శేషు రాణి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ దుర్గప్రసాదరావు మాట్లాడారు. విదుషి కస్తూరి కమలదీప్తి (విశాఖపట్నం) శాస్త్రీయ సంగీత కచేరి నిర్వహించారు. వయోలిన్‌పై మందా శ్రీరమ్య(చెన్నై), మృదంగంపై బుర్రా శ్రీరామ్(చెన్నై) వాయిద్యాన్ని అందించారు. ఉపాధ్యక్షులు డాక్టర్ రాజరాజేశ్వరి, ఎం.మీనాక్షి, పి.లలితదేవి, కార్యదర్శి ఎ.మంగాదేవి, కోశాధికారి ఎం.విజయలక్ష్మి, ఉప కార్యదర్శి ఎం.మాధవీకృష్ణ పాల్గొనగా, కళాకారులను సత్కరించారు.

విద్యావ్యాప్తికి 'బాలబాట' తోడ్పాటు



తెనాలి: కమ్యూనిటీ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ (కార్డ్స్) సంస్థ ఆధ్వర్యంలో బాలల విద్యావ్యాప్తికై నిర్వహిస్తున్న బాలబాట కార్యక్రమం ఆదివారం రూరల్ మండల గ్రామం అంగలకుదురులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిపారు. బాలబాటలోని బాల ఉపాధ్యాయులకు నెలవారీ సమావేశంలో భాగంగా వారికి నిత్యావసర సరుకులను అందజేశారు. డాక్టర్ పి.రంజన్‌బాబు స్థాపించిన కార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో డ్రాపవుట్స్‌ను తగ్గించి, బాలలు అందరూ చదువుకోవాలనే ఆశయంతో బాలబాట కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలియజేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 4వ తరగతి చదువుతున్నవారిని చేర్పిస్తున్నామని వివరించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా వేమూరు ఎంఈవో-2 డాక్టర్ డి.రోజీలాండ్ హాజరై, విద్య ఎలా ఉన్నతంగా నిలబడుతుంది? అనేది వివరించారు. ఉప్పలపాడు పీఈటీ సీహెచ్ వినయ్‌కుమార్, కార్డ్స్ బాలబాట డిప్యూటీ డైరెక్టర్ ఆర్.అనిత, ఎం.రవికుమార్, కార్డ్స్ సాంస్కృతిక ఉపాధ్యాయుడు కె.బాబూరావు పాల్గొన్నారు.